నమస్తే తెలంగాణ
ఖమ్మం
5 | ఖమ్మం, బుధవారం 29 జనవరి 2025 | KHAMMAM

నాలుగు పథకాల పేరిట కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి కూడా నాటకం ఆడినట్లుగానే కన్పిస్తోంది. పథకాల అమలు పేరుతో మాటలు మారుస్తూ, గడువులు పెంచుతూ వచ్చిన రేవంత్ సర్కారు.. ఎట్టకేలకు ఈ నెల 26న నాలుగు పథకాల ఫలాలను లబ్ధిదారుల చెంతకు చేరుస్తున్నట్లు ఎంతో ఆర్భాటంగా ప్రకటించింది. అదే రోజున పైలట్ గ్రామాల్లో సభలు పెట్టింది. ఎంపిక చేసిన లబ్ధిదారులకు మంజూరు పత్రాలు కూడా అందజేసింది. కానీ వాటికి సంబంధించిన నగదు మాత్రం కొందరికే జమ చేసింది. దీంతో ఓవైపు పైలట్ గ్రామాల కింద ఎంపిక కాని లక్షలాది మంది ప్రజల ఆశలపై ఆదిలోనే నీళ్లు చల్లింది. మరోవైపు పైలట్ గ్రామాల్లోని లబ్ధిదారుల్లోనూ సింహభాగం మందికి పంగనామాలు పెట్టింది. దీంతో 26న గానీ, ఆ తరువాత గానీ ప్రభుత్వం చెప్పినట్లుగా పథకాల పైకాలు జమ కాని పేదలందరూ ప్రభుత్వంపై మండిపడుతున్నారు. పైగా పథకాలన్నింటికీ అనర్హులను ఎంపిక చేశారంటూ గ్రామసభల్లో గగ్గోలు పెట్టినా వారికే పథకాల పైకాలను జమ చేయడంతో అర్హులందరూ రగిలిపోతున్నారు. – ఖమ్మం, జనవరి 28 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)

మళ్లీ దగా.. మరో ధోకా..

- అర్హులకు అందని సాయం.. అనర్హులకే అందలం..
- పైలట్ గ్రామాల్లోనూ పేదలకు అందని ప్రభుత్వ పథకాలు
- కేవలం ఎంపిక చేసిన వాళ్లకు మాత్రమే నగదు జమ
- వారిలోనూ అందరికీ చేరని పథకాలు, పైకాలు
- పైగా ఎంపిక చేసిన వారిలో సింహభాగం అనర్హులే..
- అర్హులు నిలదీసినా ఆ తర్వాత అనర్హులకే మంజూరు పత్రాలు..
- గ్రామసభల్లో పేదలు అభ్యంతరం చెప్పినా పెద్దలకే పైకాల జమలు

పథకాలకు అర్హులను ఎంపిక చేయలేదంటూ ములకలపల్లి జీపీ గేటు వద్ద ధర్నా చేస్తున్న నిరుపేదలు (ఫైల్)

'హనుమంతుడి పెళ్లి ఎప్పుడు?' అంటే 'రేపే?' అనే మాదిరిగా.. పాలనా పగ్గాలు చేపట్టినప్పటి నుంచి పథకాల అమలు గడువును పొడిగించుతూ వచ్చింది కాంగ్రెస్ ప్రభుత్వం. ముఖ్యంగా ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు, రైతుభరోసా, ఆత్మీయ భరోసా వంటి పథకాలను తమ అధినేత్రి సోనియాగాంధీ పుట్టిన రోజైన, తమ ప్రభుత్వం కొలువుదీరిన డిసెంబర్ 9 నుంచి అమలు చేస్తామంటూ ఆరు నెలల క్రితమే ప్రకటించింది కాంగ్రెస్ ప్రభుత్వం. ఆ తరువాత ఆ గడువును సంక్రాంతికి పొడిగించింది. ఆ తరువాత దానిని గణతంత్ర దినోత్సవమైన జనవరి 26కు మార్చింది. ఆ తరువాత అర డజను కారణాలు చెబుతూ మార్చి 31 వరకూ మార్చివేసింది. చివరికి మరో మోసానికి తెర తీస్తూ.. జనవరి 26న ఇంకో ప్రకటన చేసింది. మండలానికి ఒక పైలట్ గ్రామాన్ని ఎంపిక చేస్తామని, 26న ఆ గ్రామంలోని నాలుగు పథకాల లబ్ధిదారులకు పథకాల ఫలాలను అందజేస్తామని వెల్లడించింది. అర్హుల అభ్యంతరాల మధ్య అనర్హుల పేర్లతో కూడిన జాబితాలనే ఆమోదించింది. వాటిల్లోని అనర్హులకు, అర్హులకే ఆ రోజున మంజూరు పత్రాలు అందించింది. రైతు భరోసా, ఆత్మీయ భరోసా పథకాల లబ్ధిదారులకు (అందులో సింహభాగం అనర్హులే) జనవరి 27న రూ.6 వేల చొప్పున జమ చేసింది. కానీ అందులో చాలా మంది నిజమైన లబ్ధిదారులకు పథకాల పైకాలు జమ కాలేదు. 'నమస్తే తెలంగాణ' క్షేత్రస్థాయి పరిశీలనలో ఇదే విషయం తేటతెల్లమైంది. తమకు అర్హత ఉన్నప్పటికీ, జాబితాలో తమ పేరు ఉన్నప్పటికీ రైతు భరోసా, ఆత్మీయ భరోసా నగదు జమ కాలేదని అనేకమంది పేదలు, లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇక తాము నిరుపేదలమైనా తమకు ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయలేదని వాపోయారు.

మచ్చుకు కొన్ని ఉదాహరణలు..

తిరుమలాయపాలెం మండలంలో 18,165 కుటుంబాలకు జాతీయ ఉపాధి హామీ పథకం జాబ్ కార్డులు ఉన్నాయి. వీరిలో అసలు భూమిలేని కుటుంబాలు సుమారు పది వేలు. కనీసం 20 రోజులు పని చేసి ఉండాలన్న నిబంధన పెట్టిన ప్రభుత్వం.. మండలంలోని 40 గ్రామ పంచాయతీల్లో కలిపి కేవలం 1,767 కుటుంబాలనే ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి ఎంపిక చేసింది. ఇదే మండలంలోని పైలట్ గ్రామమైన ఏలువారిగూడేన్ని పరిశీలిస్తే మరింత స్పష్టత వస్తుంది. గ్రామంలో 55 మందిని ఇందిరమ్మ ఇళ్లకు అర్హులుగా గుర్తించారు. కానీ కేవలం 13 మందికే మంజూరు పత్రాలు అందజేశారు. రేషన్ కార్డులకు 35 మందిని గుర్తించారు. కేవలం 18 మందికే మంజూరు పత్రాలు అందించారు. ఆ రేషన్ కార్డుల పత్రాలనూ తప్పుల తడకగా ముద్రించారు. ఇక ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి 46 కుటుంబాల వారిని అర్హులుగా గుర్తించారు. కానీ సవాలక్ష కొర్రీలతో 22 మందికి మాత్రమే పథకాన్ని వర్తింపజేశారు. రైతు భరోసాకు 202 మందిని ఎంపిక చేశారు. కానీ ఇంకా కొద్దిమంది ఖాతాల్లో జమ చేయలేదు. అన్నపురెడ్డిపల్లి మండలం ఊటుపల్లి రెవెన్యూలో మొత్తం 440 మంది రైతులు రైతు భరోసాకు అర్హులు. సుమారు 1,399 ఎకరాలను వీరు సాగుచేస్తున్నారు. వీరికి రూ.83.98 లక్షలు జమ కావాల్సి ఉంది. కానీ నూతనంగా పట్టాదారు పాసుపుస్తకాలు పొందిన సుమారు 39 మంది రైతులకు తాజాగా రైతు భరోసా జమ కాలేదు. ఈ ఏడాది జనవరి ఒకటో తేదీ నాటికి పాస్‌బుక్‌లు మంజూరైన రైతులకు కూడా రైతు భరోసాను వర్తింపజేస్తామని చెప్పిన ప్రభుత్వం.. నాలుగు నెలల క్రితం పట్టాబుక్‌లు మంజూరైన రైతులకు కూడా రైతు భరోసాను జమ చేయలేదు. తాజాగా పట్టాబుక్‌లు మంజూరు చేసిన 39 మంది రైతుల్లో కేవలం 12 మందికి మాత్రమే పంటల పెట్టుబడి సాయాన్ని అందించడం గమనార్హం.

నాకు రైతు భరోసా రాలేదు..

అన్నపురెడ్డిపల్లి మండలం ఊటుపల్లి రెవెన్యూలోని సర్వే నెంబర్ 101లో నాకు మూడు ఎకరాల సాగు భూమి ఉంది. నాలుగు నెలలు క్రితం మా నాన్న పేరు నుంచి నా పేరు మీదికి మూడు ఎకరాలను వారసత్వ బదిలీ చేసుకున్నాం. నాకు పట్టాదారు పాసుపుస్తకం కూడా వచ్చింది. అధికారులు చెప్పిన వెంటనే రైతుభరోసా కోసం నేను ఇప్పటికే దరఖాస్తు చేసుకొని ఉన్నాను. కానీ పైలట్ ప్రాజెక్టుగా ఉన్న మా గ్రామంలో నాకు రైతుభరోసా రాలేదు. ఈ ఏడాది జనవరి 1 నాటికి నూతన పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన రైతులందరికీ రైతుభరోసా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. కానీ నాలుగు నెలల క్రితం పట్టా పొందిన నాకు మాత్రం రైతుభరోసాను ఇవ్వలేదు.

–మామిళ్లపల్లి సాహిత్య, ఊటుపల్లి, అన్నపురెడ్డిపల్లి

అనర్హులకే పథకాలు..

నిరుపేదలకు మాత్రమే ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామని చెప్పిన ప్రభుత్వం.. అర్హులెవరికీ ఇవ్వలేదు. పైగా అనర్హులకే ఇచ్చింది. నాలుగు పథకాల్లోనూ (ఇందిరమ్మ ఇళ్లు, ఆత్మీయ భరోసా, రైతుభరోసా, రేషన్‌కార్డులు) అలాగే చేసింది. నాకు తడికల ఇల్లు మాత్రమే ఉంది. సర్వే సమయంలో అధికారులు వచ్చారు. ఇంటిని చూశారు. రాసుకొని వెళ్లారు. కానీ మొన్నటి ఇందిరమ్మ ఇళ్ల అర్హుల జాబితాలో నా పేరు లేదు. ఇప్పటికే రెండుసార్లు దరఖాస్తు చేసుకున్నప్పటికీ నాకు ఇందిరమ్మ ఇల్లు రాలేదు. పైగా మాది పైలట్ గ్రామంగా ఎంపికైన సోంపల్లి. మా ఊరిలోనే అర్హులకు పథకాలు అందకపోతే ఎలా? ఉపాధి పనులకు కూడా నేను క్రమం తప్పకుండా వెళ్తుంటాను. ఆత్మీయ భరోసా పథకానికి నేను అర్హురాలినైనప్పటికీ ఆ జాబితాలో నా పేరు రాలేదు. ప్రభుత్వం అనర్హులకే అన్నీ ఇస్తోందని అర్థమవుతోంది.

–బోరెం అంజమ్మ, సోంపల్లి, బూర్గంపహాడ్ మండలం

అనర్హులకే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశారు..

మా ఊరిని పైలట్ గ్రామంగా ఎంపిక చేశారు. కానీ ఇందిరమ్మ ఇళ్లను మాత్రం అనర్హులకే మంజూరు చేశారు. ఏకంగా వారికి మంజూరు పత్రాలను కూడా అందజేశారు. మా గ్రామంలో అర్హులు చాలామంది ఉన్నప్పటికీ వారిలో అత్యధికులకు ఇందిరమ్మ ఇళ్లు రాలేదు. ఉండేందుకు నాకు ఇల్లు కూడా లేదు. సాగుచేసుకునేందుకు సెంటు భూమి కూడా లేదు. హోటల్లో పనిచేసుకొని బతుకుతున్నా. అయినా ప్రభుత్వం నాకు ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేయలేదు. నేను గట్టిగా అడిగినందుకు పంచాయతీ కార్యదర్శి నాపై కక్ష గట్టి నాకు ఇల్లు రాకుండా చేశారు. మా గ్రామంలో మళ్లీ ప్రభుత్వం పూర్తిస్థాయిలో సర్వే చేసి అర్హులకు మాత్రమే పథకాలు వర్తింపజేయాలి.

–నిట్టా శిలీష, భూపాలపట్నం, పినపాక

ఈ రోజు వరకు అకౌంట్లో డబ్బులు పడలేదు..

నా పేరు రాధిక. నా పేరుతో రెండెకరాల సాగు భూమి ఉన్నది. నా భర్త పేరు నాగేశ్వరరావు. ఆయన పేరుతో కూడా మూడు ఎకరాల సాగు భూమి ఉన్నది. మేమిద్దరూ రైతుభరోసా పథకానికి ఎంపికైనట్లు చెప్పారు. ఈ నెల 26న రైతుభరోసా కింద ఎకరానికి రూ.6 వేల చొప్పున పెట్టుబడి సాయం జమ అవుతుందని చెప్పారు. కానీ మాకు ఇంత వరకూ డబ్బులు పడలేదు. డబ్బులు జమ అయినట్లు మా సెల్‌ఫోన్లకు మెసేజీలు కూడా రాలేదు. మా మామయ్యకు ఎకరం, మా అత్తయ్యకు అత్తయ్యకు అరెకరం చొప్పున పంట భూమి ఉంది. కానీ వారికి కూడా రైతుభరోసా నిధులు జమ కాలేదు. మా ఊరిలో ఎవరిని అడిగినా పడలేదనే అంటున్నారు. రెండు, మూడు రోజులు చూసి రైతు వేదిక దగ్గరకు వెళ్లి వ్యవసాయ అధికారులను అడుగుతాం.

–పోతగాని రాధిక, నాగేశ్వరరావు దంపతులు, రైతుభరోసా లబ్ధిదారులు, వేపకుంట్ల

26నే రైతుభరోసా పడుతుందని సీఎం చెప్పినా పడలేదు..

మాది చండ్రుగొండ మండలంలోని బెండాలపాడు గ్రామం. మా ఊరిని రాష్ట్ర ప్రభుత్వం పైలట్ గ్రామంగా ఎంపికచేసింది. మా గ్రామంలో నాకు ఐదు ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. కానీ ఇప్పటి వరకు నాకు రైతుభరోసా పంటల పెట్టుబడి సాయం డబ్బులు అందలేదు. ఈ నెల 26నే జమ చేస్తామని సాక్షాత్తూ సీఎం సారే చెప్పారు కానీ ఇప్పటి వరకూ నా అకౌంట్లో రైతుభరోసా నగదు జమ కాలేదు. పంటల పెట్టుబడి కోసం ఇప్పటికే ఏడాదిన్నరగా ఎదురుచూస్తున్నాం. రేపుమాటు అంటున్నారే తప్ప ఇంకా ఇవ్వడం లేదు. 26న ఇస్తామని చెప్పారు. అయినా ఇవ్వలేదు. కేసీఆర్ సారు ఉన్నప్పుడు ఠంచనుగా రైతుబంధు వచ్చేది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ వచ్చింది. మాలాంటి రైతులకు బాధలు మొదలయ్యాయి.

–బోడా రవి, రైతు, బాలికుంట, బెండాలపాడు, చండ్రుగొండ

మంజూరు పత్రమిచ్చారు.. డబ్బులు జమకాలేదు..

నాకు సాగుభూమి లేదు. క్రమం తప్పకుండా ఉపాధి హామీ పనికి వెళ్తుంటా. దీంతో ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకానికి అధికారులు నన్ను ఎంపిక చేశారు. ఈ నెల 26న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, కలెక్టర్ ఖాన్ వచ్చి మా ఊరిలో మీటింగ్ పెట్టారు. ఆత్మీయ భరోసా పథకానికి నేను ఎంపికయ్యానని చెప్పారు. మంజూరు పత్రాన్ని కూడా నాకు అందజేశారు. తెల్లారితే నా బ్యాంకు అకౌంట్లో రూ.6 వేల డబ్బులు జమ అవుతాయని చెప్పారు. కానీ ఈ రోజు వరకు జమ కాలేదు. మా ఊరి మాజీ ప్రజాప్రతినిధులను అడిగాము. పడతాయిలే అని అంటున్నారు. కానీ ఎప్పుడు పడతయో ఏమో! ఈ నెలాఖరు వరకు ఎదురుచూస్తాను.

–బండి సుగుణ, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా లబ్ధిదారురాలు, వేపకుంట్ల

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

హామీలు అమలయ్యే వరకు వదిలిపెట్టం..

- ప్రజా క్షేత్రంలో ప్రశ్నించిన వారిపై దాడులా?
- స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడొచ్చినా విజయం బీఆర్ఎస్‌దే..
- బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు

చండ్రుగొండ, జనవరి 28 : ఎన్నికలకు ముందు ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేసేంత వరకూ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టే ప్రసక్తే లేదని, క్షేత్రస్థాయిలో ప్రభుత్వ విధానాలు, వైఫల్యాలను ఎప్పటికప్పుడు ఎండగట్టాలని బీఆర్ఎస్ భద్రాద్రి జిల్లా అధ్యక్షుడు రేగా కాంతరావు పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. దామరచర్లలో మండల పార్టీ కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశం మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు అధ్యక్షతన మంగళవారం జరిగింది. ఈ సందర్భంగా రేగా మాట్లాడుతూ అమలుకాని, ఆచరణకు నోచుకోని హామీల గురించి ప్రజాక్షేత్రంలో, గ్రామసభల్లో ప్రశ్నించిన వారిపై భౌతిక దాడులకు పాల్పడడం ఎంతవరకు సబబు అని ఆయన ప్రశ్నించారు. అలవికాని హామీలు ఇచ్చి కాంగ్రెస్ అధికారాన్ని దక్కించుకున్నదని ఆరోపించారు. ఈడీ దాడుల్లో మంత్రి పొంగులేటి ఇంట్లో పట్టుబడిన డబ్బులు ఎక్కడికి వెళ్లాయో కేంద్ర ప్రభుత్వం సమాధానం చెప్పడం లేదని ప్రజల పక్షాన ఆయన ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికలు ఎప్పుడు వచ్చినా విజయం బీఆర్ఎస్‌దేనన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా..: మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు

నియోజకవర్గ కార్యకర్తలకు, కాంగ్రెస్ గూండాల దాడిలో గాయపడిన బీఆర్ఎస్ నాయకుడు మేడా మోహన్‌రావుకు బీఆర్ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు భరోసా ఇచ్చారు. గత కేసీఆర్ పాలనను పక్క రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు మెచ్చుకుంటుంటే.. సీఎం రేవంత్‌రెడ్డికి విలువలేకుండా పోయిందన్నారు. ఎన్నికల సమయంలో రైతుబంధు రూ.15 వేలు ఇస్తామని చెప్పి.. ఇప్పుడు రూ.12 వేలు ఇస్తామనడం ప్రజలను మోసం చేయడమే అవుతుందన్నారు. కల్యాణలక్ష్మి డబ్బులు, తులం బంగారం ఇచ్చే వరకు విడిచిపెట్టేది లేదన్నారు. సమావేశంలో నియోజకవర్గ నాయకులు వగ్గెల పూజ, జిల్లా అధికార ప్రతినిధి యూఎస్ ప్రకాశ్ రావు, పార్టీ మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి దారా వెంకటేశ్వరరావు, సంగొండి రాఘవులు, కొణకండ్ల వెంకటరెడ్డి, నల్లమోతు వెంకటనారాయణ, నరుకుళ్ల సత్యనారాయణ, మేడా మోహన్‌రావు, సూర వెంకటేశ్వరరావు, భూపతి రమేశ్, గాదె లింగయ్య, ఉన్నం నాగరాజు, గుగులోత్ రాందాసు, పాండ్ల అంజన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

ఆరు గ్యారెంటీలంటూ మోసం

సంక్షేమ పథకాల అమలుకు చిన్న గ్రామాల ఎంపికా?
గ్రామసభలో ప్రజలు నిలదీస్తే ప్రతిపక్ష పార్టీలపై నిందలా?
విలేకరుల సమావేశంలో జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు

బోనకల్లు, జనవరి 28 : ఎన్నికలకు ముందు ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి.. అధికారంలోకి రాగానే కాంగ్రెస్ ప్రభుత్వం వాటిని విస్మరించిందని జడ్పీ మాజీ చైర్మన్ లింగాల కమల్‌రాజు ఆరోపించారు. రావినూతల గ్రామంలో బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జున రావు నివాసంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క ఆరు గ్యారెంటీలు అమలు చేస్తామని చెప్పి దేవుని సాక్షిగా బాండ్ రాసి ప్రచారం చేశాడని గుర్తు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఒక్క రేషన్ కార్డు కూడా మంజూరు చేయలేదని డిప్యూటీ సీఎం కొన్నిచోట్ల మాట్లాడటం అవివేకమన్నారు. ఎమ్మెల్యేగా మధిర నియోజకవర్గంలో 2021లో 5 మండలాల్లో రేషన్ కార్డులు పంపిణీ చేసిన విషయం ఆయనకు తెలియదా? అని ప్రశ్నించారు. మధిర మున్సిపాలిటీలో 22 వార్డులు ఉన్నాయన్నారు. కానీ.. కేవలం 5 చిన్న గ్రామపంచాయతీలను సంక్షేమ పథకాలను అందించడం కోసం ఎంపిక చేసుకోవడం ఈ ప్రభుత్వం చేతగానితనానికి నిదర్శనమన్నారు. నియోజకవర్గంలోని 5 మండలాల్లో గత కేసీఆర్ ప్రభుత్వంలో 9 వేల మందికి ఒకేసారి రైతుబంధు వారి ఖాతాల్లో జమ చేసినట్లు గుర్తు చేశారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం 5 మండలాల్లో కేవలం 4,175 మంది రైతులకు మాత్రమే రైతుభరోసా కల్పించిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని గ్రామసభల్లో ప్రజలు ఎక్కడికక్కడ నిలదీస్తే.. ప్రతిపక్ష పార్టీలపై నిందలు మోపుతూ కాలం గడుపుతున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలు చేసే వరకూ పోరాటాలు చేస్తామని పిలుపునిచ్చారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు చేబ్రోలు మల్లికార్జునరావు, ప్రధాన కార్యదర్శి మోదుగుల నాగేశ్వరరావు, మధిర ఏఎంసీ మాజీ చైర్మన్ కొనకంచి నాగరాజు, మాజీ సర్పంచ్ కొమ్మినేని ఉపేందర్, పారా ప్రసాద్, తన్నీరు పుల్లారావు, కంచర్ల బాబు, రాజారావు, జేడీ మూర్తి పాల్గొన్నారు.

ఉన్నోళ్లకే ఇళ్లిచ్చారు!

- ఇందిరమ్మ ఇళ్ల మంజూరులో పేదలకు అన్యాయం
- పూరిగుడిసెలో ఉన్నవారికీ మొండిచేయి
- ఇంటిస్థలం ఉన్నా గుర్తించని కాంగ్రెస్ ప్రభుత్వం
- సర్వేలు ఎందుకు చేశారంటూ మండిపడుతున్న జనం
- రోడ్డెక్కి ఆవేదన వ్యక్తం చేసిన 'మైలారం' గ్రామస్తులు
- మొన్న పైలట్ గ్రామసభలో రెండువర్గాల మధ్య ఫైటింగ్
- 'నమస్తే' పరిశీలనలో నమ్మలేని నిజాలు బహిర్గతం

ఇందిరమ్మ ఇల్లు మాకు రాలేదంటే.. మాకు రాలేదంటూ తమ బాధను వెళ్లగక్కారు.. పైగా ఇండ్లు ఉన్నవాలికే మళ్లీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరయ్యాయని ఆవేదనను వెలిబుచ్చారు. పూరిగుడిసె, రేకుల షెడ్లలో ఉంటున్నామని కొందరు.. ఇంటిస్థలం ఉండి ఇల్లు కట్టుకోలేక కిరాయికి ఉంటున్నామని, అయినా కాంగ్రెస్ ప్రభుత్వం కనికరించలేదని మరికొందరు తమ గోడును వినిపించారు. మంగళవారం లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామపంచాయతీని సందర్శించిన 'నమస్తే తెలంగాణ' విలేకరుల బృందానికి నమ్మలేని నిజాలు ఎదురయ్యాయి. గ్రామంలో నిరుపేదలందరూ రోడ్డుపైకి వచ్చి మరీ తమకు రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఇందిరమ్మ ఇల్లు మంజూరు కాలేదని, అనర్హులకే ఇల్లు మంజూరయ్యాయని విన్నవించుకున్నారు.
- భద్రాద్రి కొత్తగూడెం, జనవరి 28 (నమస్తే తెలంగాణ)

అది లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామపంచాయతీ. అందులో మూడు గ్రామాలు మైలారం, పాతూరు, చింతవర్రి. రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా నాలుగు గ్యారెంటీ పథకాలు అమలు చేసేందుకు అధికారులు మైలారాన్ని పైలట్ గ్రామంగా గుర్తించారు. మారుమూల గ్రామం కావడంతో ఎలాంటి గొడవలు ఉండవనుకొని ఈ నెల 26వ తేదీన గ్రామసభ ఏర్పాటు చేశారు. లబ్ధిదారుల జాబితాలో ఉన్న పేర్లను చదివి వినిపించడంతో సభలో గందరగోళం మొదలైంది. రెండువర్గాల వారు గొడవపడి జాబితా పేర్లను చింపివేశారు. దీంతో ఆ గ్రామంలో రెండువర్గాల వారు ఒకరి మీద ఒకరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదులు సైతం చేసుకున్నారు.

పైలట్‌లో ఫైటింగ్..

అది పేరుకే పైలట్ గ్రామం. అక్కడ ఇప్పుడు ఫైటింగ్‌లు జరుగుతున్నాయి. మైలారం పంచాయతీ పరిధిలో ఉన్న మూడు గ్రామాల లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు, రేషన్ కార్డులు రాకపోవడంతో గ్రామస్తులు గరం అవుతున్నారు. మంగళవారం ఆ గ్రామానికి 'నమస్తే తెలంగాణ' విలేకరుల బృందం వెళ్లి పరిశీలించగా.. గ్రామస్తులు నమ్మలేని నిజాలు చెబుతున్నారు. డాబాలు ఉన్నవారికి ఇళ్లు వచ్చాయని, నాయకులు చెప్పిన వారికే ఇండ్లు వచ్చాయని ఆరోపించారు. ఓట్ల కోసం వచ్చినప్పుడు మేము కనబడతాం గానీ ఇప్పుడు కనబడమా అంటూ రోడ్డుపైకి వచ్చి మరీ ఆందోళన వ్యక్తం చేశారు. ఇది ఒకరి సమస్య కాదని, మాలాంటి వారు చాలామంది ఉన్నారని సుమారు 50 మందికి పైగా గ్రామస్తులు రోడ్డెక్కి తమ బాధను వెళ్లగక్కారు.

లక్ష్మీదేవిపల్లి మండలం మైలారం గ్రామపంచాయతీలో ఇందిరమ్మ ఇండ్లు రాని నిరుపేదలు

ఉన్నోళ్లకే ఇండ్లు..

భవనాలు ఉన్నవారికి ఇందిరమ్మ ఇండ్ల జాబితాలో చోటు దొరకడంతో పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేకుల షెడ్లలో ఉన్న తమకు ఇండ్లు రాలేదని బాధపడుతున్నారు.

మైలారం పంచాయతీ వివరాలు	
మండలం:	లక్ష్మీదేవిపల్లి
పంచాయతీ:	మైలారం,
గ్రామాలు:	మైలారం, పాతూరు, చింతవర్రి
జనాభా:	1,600
ఇళ్లు:	460
కుటుంబాలు:	480
మంజూరైన పథకాలు	
ఇందిరమ్మ ఇండ్లు:	255
రేషన్‌కార్డులు:	65
ఆత్మీయ భరోసా:	43
రైతుభరోసా:	154

అరుగు మీదనే ఉంటున్న..

నాకు ఇల్లు లేదు. పరాయి వాళ్ల అరుగు మీద తల దాచుకుంటున్నా. భర్త లేడు. బడిలో పిల్లలకు అన్నం వండి పెడుతున్న. నేను ఈ సార్లకు కనబడలేదా. ఇంత దారుణమా సారూ. నాలాంటి పేదోళ్ల కడుపు కొడితే ఎట్టా సారూ. ఇల్లు వస్తదని అంటే సంబరపడ్డ.. ఇప్పుడు ఇల్లు రాలే ఏం చేయాలో అర్థం కావడం లేదు.

– మల్లెబోయిన స్వరూప, ఒంటరి మహిళ, మైలారం పంచాయతీ

కాంగ్రెస్ మోసం చేసింది..

మా ఇల్లు చూస్తే ఇంట్లోకి ఎవరూ రారు. అప్పుడు ఇల్లు కాలిపోయింది. అధికారులు రాసుకుని పోయారు. ఇప్పుడన్నా ఇందిరమ్మ ఇల్లు వస్తది అనుకున్న. గ్రామసభకు పోతే నీ పేరు రాలేదన్నరు. అందరూ అక్కడ పెద్దోళ్లే ఉన్నరు. అడగలేక ఇంటికి వచ్చేశా. కాంగ్రెస్ ప్రభుత్వం పేదలను మోసం చేసింది.

– పాపమ్మ, పాతూరు, మైలారం పంచాయతీ

'ఆక్వా'తో మరింత అభివృద్ధి సాధించాలి

నాబార్డు సీజీఎం ఉదయ్‌కుమార్

మాట్లాడుతున్న నాబార్డు సీజీఎం ఉదయ్‌కుమార్

కూసుమంచి, జనవరి 28 : ప్రభుత్వాలు కల్పించే రాయితీలను సద్వినియోగం చేసుకొని మత్స్య కార్మికులు ఆక్వారంగంలో మరింత అభివృద్ధి సాధించాలని నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్(సీజీఎం) ఉదయ్‌కుమార్ అన్నారు. పాలేరులోని మత్స్య పరిశోధన కేంద్రంలో పీవీ నర్సింహారావు పశువైద్య విశ్వవిద్యాలయం, భారతీయ వ్యవసాయ గ్రామీణాభివృద్ధి సహకారంతో మత్స్య కార్మికులకు 'బయోఫ్లాక్ విధానంలో చేపల సాగు' అనే అంశంపై నైపుణ్యాభివృద్ధి శిక్షణ తరగతులు మంగళవారం ప్రారంభమయ్యాయి. జిల్లా మత్స్య కార్మికులతోపాటు వనపర్తి, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల నుంచి హాజరయ్యారు. తొలిరోజు ముఖ్యఅతిథిగా హాజరైన సీజీఎం మాట్లాడుతూ ఆధునిక పద్ధతిలో చేపల సాగుపై అవగాహన పెంచుకోవడం ద్వారా లాభాలు మరింతగా ఆర్జించవచ్చన్నారు. పీవీ నర్సింహారావు విశ్వవిద్యాలయం డైరెక్టర్ డాక్టర్ హరికృష్ణ మాట్లాడుతూ రాష్ట్రం నీటి వనరులలో దేశంలోనే మూడో స్థానంలో ఉందని, చేపల ఉత్పత్తిలో ఆరవ స్థానంలో ఉందన్నారు. రాష్ట్రాన్ని ఈ స్థాయి నుంచి మరింత ముందుకు తీసుకెళ్లడానికి యువ మత్స్య కార్మికులు మరింతగా శ్రమించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్ ఎం.హరికిషన్, డాక్టర్ ఎం.శ్యాంప్రసాద్, జిల్లా మత్స్యశాఖ అధికారి శివప్రసాద్, కే వెంకటేశ్వర్లు, ఎస్‌బీఐ రీజినల్ మేనేజర్ వీ సత్యనారాయణ, విద్యాసాగర్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.